గుర్రపుడెక్క, కిక్కిసతో రూపుకోల్పోయిన డ్రెయిన్లు

- డ్రెయిన్ల అభివృద్ధిని విస్మరించిన కూటమి ప్రభుత్వం
- చిన్నపాటి వర్షాలకే ముంపునకు గురవుతున్న పంట పొలాలు
- నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



రాళ్లకోడు డ్రెయిన్‌లో దట్టంగా అల్లుకుపోయిన కిక్కిస

గుడివాడరూరల్: నియోజకవర్గ పరిధిలోని గుడివాడ, నందివాడ మండలాల్లో డ్రెయిన్ల పూడికతీయకపోవడంతో అధ్వానంగా మారాయి. గుర్రపుడెక్క, తూడు, కిక్కిసతో పేరుకుపోయి నీటి ప్రవాహానికి అవరోధంగా మారాయి. ఫలితంగా మురుగు నీరు సక్రమంగా ప్రవహించక పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా డ్రెయిన్ల పూడిక తీత పనులను విస్మరించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

రాళ్లకోడు డ్రెయిన్ వెంబడి పేరుకున్న కిక్కిస

నందివాడ మండలంలోని రాళ్లకోడు డ్రెయిన్ వెంబడి కిలో మీటర్ల మేర కిక్కిస దట్టంగా పేరుకుపోయి కాల్వ రూపురేఖలు లేకుండాపోయింది. కుదరవల్లి నుంచి ఇలపర్రు వరకు ఉన్న కుదరవల్లి డ్రెయిన్ పరిస్థితిదీ ఇదే తంతు. డ్రెయిన్‌లో గుర్రపుడెక్కతో పాటు ముళ్ల కంచెలు పేరుకుపోయి నీరు సక్రమంగా వెళ్లడం లేదు. ఫలితంగా రైతులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. వందలాది ఎకరాల మురుగునీరు వెళ్లేందుకు ఉన్న భూమికోడు పరిస్థితి కూడా అంతే. డ్రెయిన్ మొత్తం ఎక్కడ చూసినా తూడు, డెక్కతో దర్శనమిస్తోంది. రుద్రపాక నుంచి అనమనపూడి వరకు మూడు కిలో మీటర్ల మేర ఉన్న అనమనపూడి డ్రెయిన్ ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో పూర్తిగా రూపురేఖలు కోల్పోయింది. ఆరు నెలల క్రితం సదరు కాంట్రాక్టర్ మొక్కుబడిగా పనులు నిర్వహించి, డ్రెయిన్ పనులను గాలికొదిలేశాడు. ఫలితంగా పరిసర ప్రాంత రైతులకు శాపంలా మారింది.

ఆత్కూరు డ్రెయిన్ పరిస్థితీ అంతే..

పెదలింగాల నుంచి పుట్టగుంట వరకు రైతులకు ఉపయోగంగా ఉన్న ఆత్కూరు డ్రెయిన్ పరిస్థితి కూడా అధ్వానంగా మారింది. ఈ డ్రెయిన్ ద్వారా పెదలింగాల, చినలింగాల, చేదుర్తిపాడు, ఒద్దుల మెరక గ్రామాల్లోని పంట పొలాల మురుగు నీరు ఈ డ్రెయిన్ ద్వారానే బుడమేరులో కలవాలి. డ్రెయిన్ అభివృద్ధికి దాదాపుగా ఏడాదిలో రూ.60 లక్షలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు పనులు చేయకుండానే బిల్లులకు సిద్ధం కావడంతో చిన్నపాటి వర్షాలకు మురుగునీరు ప్రవహించక పొలాలు ముంపు బారిన పడి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆరోపిస్తున్నారు. తుమ్మలపల్లి నుంచి తమిరిశ వరకు ఉన్న తుమ్మలపల్లి డ్రెయిన్ పరిస్థితి కూడా అధ్వానంగా ఉంది. అదేవిధంగా గుడివాడ మండలంలోని వందలాది ఎకరాల మురుగు నీరు వెళ్లేందుకు ప్రధానంగా ఉన్న మోటూరు డ్రెయిన్(పాలకోడు) పరిస్థితి దయనీయంగా మారింది.



ముళ్ల కంచెతో రూపుకోల్పోయిన భూమికోడు డ్రెయిన్

కూటమి నేతల దందా

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో డ్రెయిన్ల పూడిక తీత పనులకు ఏడాది కాలానికి కాంట్రాక్ట్ పద్ధతిలో నిధులు కేటాయించేవారు. ఏడాది పొడవునా డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు, కిక్కిస తొలగింపు పనులను కాంట్రాక్టర్లు చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కూటమి నాయకులకు మేలు చేకూర్చేలా సాగునీటి సంఘాలను ఎన్నికలు లేకుండానే నామినేటెడ్ పద్ధతిలో నియమించారు. సాగునీటి సంఘాల పరిధిలోకే డ్రెయిన్‌ల పూడిక తీత, అభివృద్ధి పనులను అప్పగించారు. అందిందే తడవుగా సాగునీటి సంఘాల రూపంలో కూటమి నాయకులు పనులు చేయకుండా డ్రెయిన్ల అభివృద్ధిని విస్మరించడంతో రైతన్నలకు శాపంలా మారింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు కళ్లు తెరచి డ్రెయిన్ల అభివృద్ధిపై దృష్టిసారించి డ్రెయిన్లలో పేరుకుపోయిన డెక్క, తూడు, కిక్కిస తొలగింపు చర్యలు చేపట్టి తాము నష్టపోకుండా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.

మెయింటెనెన్స్ పనులు చేయడం లేదు

సాగునీటి సంఘాలు వచ్చిన తర్వాత డ్రెయిన్ల మెయింటెనెన్స్ పనులు అటకెక్కాయి. డ్రెయిన్లన్నీ పూడుకుపోయి నీరు సక్రమంగా అందడం లేదు. చేపల చెరువులకు నీరు సక్రమంగా రాకపోవడంతో చెరువులను లీజుకు తీసుకుని ఎండగట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. డ్రెయిన్ల మెయింటెనెన్స్ పనులను వెంటనే చేపట్టాలి.

– చింతాడ నాగూర్, ఎల్ఎన్‌పురం



అధికారులు పట్టించుకోవడం లేదు

డ్రెయిన్లలో ముళ్లకంచెలు, గుర్రపుడెక్క పేరుకుపోయి నీళ్లు సక్రమంగా వెళ్లడం లేదు. ఈ ఖరీఫ్ సీజన్‌లో గతంలో కురిసిన వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. పంట దెబ్బ తినడంతో ఆశించిన దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. అధికారులు డ్రెయిన్ల అభివృద్ధిపై దృష్టిపెట్టకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

– కొర్రగంటి పండు, రైతు, మోటూరు



క్లుప్తంగా

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు రక్షిత తాగునీటి పథకం నుంచి గ్రామానికి సరఫరా అయ్యే తాగునీటి సరఫరాలో ఆదివారం అంతరాయం ఏర్పడనుంది. ఈ తాగునీటి పథకం వద్ద పాత నీటి పైపులైన్ల స్థానే కొత్తగా పైపులైన్లను ఏర్పాటు చేసే విషయమై ఈ అంతరాయం నెలకొందని గ్రామ కార్యదర్శి ఏజీఎల్ నరసింహారావు తెలిపారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ముదినేపల్లి రూరల్: స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు మాగంటి బాపినీయుడు, సువర్చల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు హైస్కూల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులు అందించేందుకు కొంత మొత్తాన్ని బ్యాంకులో గతంలో డిపాజిట్ చేశారు. డిపాజిట్‌పై వచ్చే వడ్డీ మొత్తాన్ని తరగతుల వారీ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతుల రూపంలో అందిస్తున్నారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్ మాట్లాడుతూ దాతల ఆశయాన్ని నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డీసీవైస్ చైర్మన్ హనుమార పేర్నీడు, ఎం స్వరాజ్యలక్ష్మి చింతపల్లి రాజా, పొట్లూరి గాంధీ, శేషగిరిరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ముదినేపల్లి రూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని సంరక్షించుకోవాలని చైల్డ్ అండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ప్రతినిధులు అన్నారు. వీరి ఆధ్వర్యంలో మండలంలోని కోడూరులో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, హెచ్ఐవీపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించి గ్రామంలో ర్యాలీ జరిపారు. లింక్ వర్కర్స్ ప్రతినిధి కె.చంద్రావతి, ఏఎన్ఎం లలితకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త సరళ, ఆశావర్కర్ ఎస్ మేరీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

ముదినేపల్లి రూరల్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చేవిధంగా క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించేందుకు కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ వై రామకృష్ణ, ఎంఈఓ-2 కె.నరేష్ కుమార్, పెయ్యేరు సర్పంచ్ అల్లు సుశీల, ఈడే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బాలికల కోలాట ప్రదర్శన

గుడ్లవల్లేరు: మండలంలోని పురిటిపాడు బాలికల కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. గ్రామంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రుల్లో భాగంగా బాలికలు తమ కోలాటాన్ని శనివారం ప్రదర్శించారు. పల్లెల్లో అంతరించుకుపోతున్న ఈ కోలాట కళకు గురువు వీరంకి శ్రీ వెంకట సత్యనారాయణ బాలికలకు శిక్షణ ఇస్తున్నారు. పురిటిపాడులోని శ్రీ బాల వినాయక ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఈ కోలాట ప్రదర్శనను నిర్వహించారు.

ఉచిత వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 398 మందికి రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచిత మందులను పంపిణీ చేశారు. ఆదివారం విజయవాడ కామినేని హాస్పిటల్, విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, గుడివాడ హోమియో డాక్టర్ భవాని, హైదరాబాదు మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ హరిహర్ వైద్య పరీక్షలు చేయనున్నట్లు డాక్టర్ వెంకట్రావు తెలిపారు.

ఉత్తమ టీచర్‌కు సన్మానం

దోసపాడు(పెదపారుపూడి): సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నుంచి 2025 సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్న మండలంలోని దోసపాడు హైస్కూల్ హెచ్ఎం బీవీఎన్ఎల్ పద్మావతిని శనివారం ఉపాధ్యాయులు సత్కరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ హైస్కూల్ హెచ్ఎం పద్మావతి ఉత్తమ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

గుడివాడ టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అనాథ వృద్ధురాలు మృతిచెందింది. ఆమె భౌతిక కాయానికి ఆర్‌కే యూత్ ఆధ్వర్యంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌కే యూత్ కన్వీనర్ మాచర్ల రామకృష్ణ మాట్లాడుతూ అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం పుణ్య కార్యంగా భావించినట్లు పేర్కొన్నారు. తమ బృందం కొంతకాలంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌కే యూత్ వారియర్స్ అత్తులూరి రవికిరణ్, గాదె చరణ్ తదితరులు పాల్గొన్నారు.

లింగవివక్షత విడనాడాలి

పమిడిముక్కల: లింగవివక్షత విడనాడాలని, లైంగిక వేధింపుల నుంచి రక్షణ పొందడం కోసం కరాటే లాంటి విద్యలు నేర్చుకోవాలని హెచ్ఎం తమ్మన వేణుగోపాలరావు పేర్కొన్నారు. ఐనపూరు హైస్కూల్లో శనివారం కిశోర బాలికలకు సంకల్ప విషయంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలను అరికట్టాలని, పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సలీమున్నీసా వ్యక్తిగత పరిశుభ్రత, లింగవివక్షత, పోష్ చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి అఖిలవాణి, అంగనవాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఏకదంతుని ప్రసాదం లడ్డూలు రూ. 46 వేలు



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని భక్తులు ప్రసాదం లడ్డూలు స్వామి వారికి బహూకరించారని ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ఐదు లడ్డూలను వేలం వేయగా మొత్తం రూ. 46,700 వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రు తురాయిపాలెంలో మజీద్ నూర్ మసీదు దగ్గర మిలాద్ ఉన్ నబీని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి ముస్లింలు అందరికీ మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా భోజనాలు పెట్టుకుని ప్రార్థనలు చేశారు.

యూరియా కొరతపై నిలదీద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామిశెట్టి

ముదినేపల్లి రూరల్: రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈనెల 9న ఏలూరులో చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు తరలిరావాలని ఎంపీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి రామిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం పార్టీ శ్రేణులతో ముదినేపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో యూరియా దొరక్క రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ పాలనలో రైతులు ఎంతో సంతోషంతో సేద్యం చేయగా నేడు చుట్టుముడుతున్న సమస్యలతో సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. ఇందుకు కూటమి ప్రభుత్వ అసమర్థత పాలనే కారణమన్నారు. నేడు ఎరువుల షాపులు, రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు దొరక్క నోస్టాక్ బోర్డులు రైతులను వెక్కిరిస్తున్నట్లు చెప్పారు. వీటిన్నంటిపై ప్రభుత్వానికి నిరసన తెలియజేసేందుకు పార్టీ శ్రేణులతో పాటు రైతులంతా ఏలూరు ఆర్డీఓ కార్యాలయానికి తరలిరావాలని కోరారు. సమావేశంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి గంటా సంధ్య, మండల శాఖ అధ్యక్షుడు బోయిన రామరాజు, జిల్లా అధికార ప్రతినిధి మోట్రు ఏసుబాబు, సీనియర్ నాయకులు జాస్తి బాబురాజేంద్రప్రసాద్, ఈడే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్‌ల జీతాలు వెంటనే చెల్లించాలి

ముస్లిం మైనార్టీ నాయకులు



మాట్లాడుతున్న మైనార్టీ సెల్ నాయకులు

గుడివాడ టౌన్: మసీదుల్లో నిరంతరం సేవచేసే ఇమామ్‌లు, మౌజ్జాన్‌లకు చెల్లించాల్సిన జీతాలు తక్షణమే చెల్లించాలని ముస్లిం మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులు విలేకరులతో మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇమామ్‌లకు రూ. 10 వేలు, మౌజ్జాన్‌లకు రూ. 5 వేలు నెలకు గౌరవ వేతనంగా అందజేసేవారన్నారు. 2024లో ఎన్నికల కోడ్ కారణంగా ఈ గౌరవ వేతనాలు నిలుపుదల చేశారని తెలిపారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డిసెంబర్ నెల వరకు దీనిని కొనసాగించి 2025 జనవరి నుంచి గౌరవ వేతనాలు ఇవ్వడం నిలుపుదల చేశారన్నారు. వీటికి ముందు 2024 ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల వేతనం కూడా ఈ ప్రభుత్వం చెల్లించలేదన్నారు. దీంతో ఇమామ్‌లు, మౌజ్జాన్‌లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 11నెలల గౌరవ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8వ తేది జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించాలని రాష్ట్ర శాఖ పిలుపునిచ్చిందన్నారు. ముస్లిం మైనార్టీ నాయకులు, మైనార్టీలు అధిక సంఖ్యలో మచిలీపట్నం జిల్లా కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి హాజరై ప్రభుత్వానికి తమ నిరసన తెలపాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ కాసీమ్(ఆబు), రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాజీ, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ సయ్యద్, నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ షమ్ము, మైనార్టీ నాయకులు కరీముల్లా బేగ్, ఖాదర్‌బేగ్, నూర్, తాజ్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

జై జై గణేశా.. బై బై గణేశా..



గుడివాడలో మేళతాళాలతో గణనాథుని ఊరేగిస్తున్న భక్తులు



వీరంకిలాకు ఎన్‌టీఆర్ కాలనీలో వినాయక నిమజ్జన ఊరేగింపు

వైభవంగా వినాయక నిమజ్జనాలు

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్‌రోడ్‌లోని విఘ్నేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గణనాథుని నిమజ్జనం కార్యక్రమం పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వామికి హారతి ఇచ్చి ఊరేగింపును ప్రారంభించారు. తీన్మార్ డప్పులు, కోయ డ్యాన్స్‌లు, విచిత్ర వేషాలు, మేళతాళాలు, బాణసంచాతో రంగులు చల్లుకుంటూ పురవీధుల్లో స్వామిని ఊరేగించారు. అనంతరం స్థానిక పామర్రు రోడ్డులోని పెద్దకాల్వలో నిమజ్జనం చేశారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: వీరంకిలాకు ఎన్‌టీఆర్ కాలనీలో గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం విగ్రహాన్ని భారీ ఊరేగింపుతో, మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్థానికంగా ఉన్న బందరు కాలువలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఊరేగింపులో యువకులు, చిన్నారులు, మహిళలు పాల్గొని సందడి చేశారు.

మండవల్లిలో..

మండవల్లి: స్థానిక స్టేషన్ రోడ్‌లో చిన్నారులు ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని శనివారం ఊరేగించారు. అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

ఉపాధ్యాయుల సేవలకు పురస్కారం

గుడ్లవల్లేరు: మండలంలోని ఉత్తమ సేవలను కనబరిచిన నలుగురు ఉపాధ్యాయులకు శుక్రవారం రాత్రి మచిలీపట్నంలో జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులను జేసీ గీతాంజలి శర్మ అందజేశారు. ఈ విషయాన్ని ఎంఈఓలు జి.జగన్‌మోహన్‌రావు, జి.గోపాలరావు విలేక రులకు శనివారం తెలిపారు. మండలంలోని పెదపా లానికి చెందిన టి.సురేష్, చంద్రాలకు చెందిన ఎం.రత్నం, గుడ్లవల్లేరుకు చెందిన వరలక్ష్మి, అంగలూరుకు చెందిన మేరీ రోజీనాకి అవార్డులను అందించినట్లు ఎంఈఓలు పేర్కొన్నారు.

అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



గుడివాడరూరల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే గృహంలో పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీభీమేశ్వరస్వామి ఆలయంలో జరగబోయే శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ కందుల గోపాలరావు ఉత్సవాల నిర్వహణ గురించి ఎమ్మెల్యేకు వివరించారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హెచ్ఎం అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి చొరవతో గ్రామస్తులు రూ.50వేల విలువ గల కంప్యూటర్‌ను శనివారం అందజేశారు. కూచిపూడి గ్రామానికి చెందిన ప్రశాంత్ ఏలేశ్వరపు (సాఫ్ట్‌వేర్ ఇంజినీర్) మిత్ర బృందం డెస్క్ టాప్ కంప్యూటర్‌ను పాఠశాలకు అందించింది.

బాలికలకు అవగాహన

పెదపూడి(మొవ్వ): మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కూచిపూడి సెక్టార్‌లోని పెదపూడి అంగన్‌డీ కేంద్రాల బాలికలకు రుతుక్రమం-పరిశుభ్రతపై శనివారం అవగాహన కల్పించారు. పెదపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు గీత అధ్యక్షత వహించారు. సీడీపీఓ విశ్వనాథ ప్రసన్న కిశోర బాలికలకు పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. కూచిపూడి సెక్టార్ సూపర్‌వైజర్ ఏఎస్ కల్యాణి, సీహెచ్ఓ కమల పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: కైకలూరు దొడ్డిపట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు పోషకాహార విలువలు, ఆరోగ్య నిబంధనలు, చేతుల శుభ్రతపై శీతనపల్లి పీహెచ్‌సీ డాక్టర్ అనుపమా శనివారం అవగాహన కల్పించారు. వెలంపేట ఎంపీయూపీ పాఠశాల్లో విద్యార్థులకు 11–18 సంవత్సరాల వయస్సులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

నేడు సంపూర్ణ చంద్ర గ్రహణం

గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రు శ్రీ భూసమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం 'సంపూర్ణ చంద్ర గ్రహణం' కారణంగా ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు మూసివేస్తున్నట్లు దేవస్థాన వ్యవస్థాపకులు, మెయిల్ అధినేతలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి అర్చన, శుద్ధి, ఏకాంతసేవ ఐదు గంటలకు స్వామి ఆలయం మూసివేస్తారు. తదుపరి సోమవారం ఉదయం ఉదయం 8.30 గంటల నుంచి దర్శనం ప్రారంభమవుతుందని తెలిపారు.

కొండలమ్మ దర్శనం మధ్యాహ్నం నుంచే నిలిపివేత

మండలంలోని వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచే చంద్ర గ్రహణం కారణంగా భక్తులకు అమ్మవారి దర్శనం నిలిపివేయనున్నట్లు ఈఓ ఆకుల కొండలరావు శనివారం తెలిపారు. సోమవారం ఉదయం 9గంటలకు పునరదర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు వెంకన్న ఆలయం మూసివేత

పమిడిముక్కల: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మంటాడ శ్రీ అలివేలు మంగా పద్మావతీ సమేత వైకంఠ వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్ల దేవస్థానాలు మూసివేస్తున్నట్లు ఆలయ ఈఓ సీహెచ్ హరి దుర్గా నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఆలయం తెరవనున్నట్లు పేర్కొన్నారు.

నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి



పోలీసు లాఠీ చార్జిలో గాయపడిన భరత్



నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్న వెంకటేశ్వరరావు, ఏసేబురాజు

కైకలూరు: వైఎస్సార్ సీపీ పాలనలో నియోజకవర్గంలో ఎన్నడూ దళితులపై దాడులు జరగలేదని, కూటమి ప్రభుత్వంలోనే వింత ధోరణులు కనిపిస్తున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ నాయకులు గుమ్మడి వెంకటేశ్వరరావు, మండవల్లి మండల అధ్యక్షుడు బేతపూడి ఏసేబురాజు విమర్శించారు. దానిగూడెంలో దళితులపై జనసేన కార్యకర్తల దాడులను ఖండిస్తూ శనివారం కైకలూరులో నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ పోలీసులు తక్షణం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, హత్యాయత్నం కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు బొడ్డు నోబుల్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు శావా నాగజగన్ బాబూరావు, కృష్ణా జిల్లా మాల సంఘ అధ్యక్షుడు మన్నేటి పుష్పరాజ్, స్థానిక నాయకులు వీరాబత్తిన సుధా, అబ్రహం లింకన్, దానం మేరీ నవరత్నకుమారి, గడిదేశి విజయ్, ఆనందబాబు, ఓగిరాల శ్రీకాంత్, వాసుపల్లి రమేష్, క్రీస్తురాజు, నవర్ల సూరి పాల్గొన్నారు. పాపం.. పయ్యేద్దు కుటుంబం జనసేన కార్యకర్తల దాడిలో దానిగూడెంకు చెందిన పయ్యేద్దు అజయ్ శుక్రవారం రాత్రి కత్తి గాట్లుకు గురయ్యాడు. దాడిని అడ్డుకుంటున్న అజయ్ తల్లి విజయ, అక్క రేఖను కూడా జనసేన నాయకులు ఇబ్బంది పెట్టారు. శనివారం దాడిని నిరసిస్తూ ఆందోళన చేస్తున్న మరో సోదరుడు భరత్‌కు పోలీసుల లాఠీచార్జిలో గాయాలయ్యాయి. దీంతో భరత్‌ను కై కలూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. తమకు న్యాయం చేయాలని బాధితుల తల్లిదండ్రులు విజయ, శ్రీను వేడుకుంటున్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు

మొవ్వ: మొవ్వ వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో పంపిణీ చేసిన యూరియా కోసం రైతులు గంటలు తరబడి పడిగాపులు పడాల్సి పరిస్థితి శనివారం ఏర్పడింది. స్థానిక ఓ ప్రవేటు ఎరువుల దుకాణంలో, కూచిపూడిలోని బార్లపూడి రోడ్డులో గల రెండు ఎరువుల దుకాణాల్లో, చినముత్తేవి రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు టోకెన్ సిస్టం ప్రకారం ఎరువులను అందజేశారు. మొవ్వ సంత బజార్ రోడ్డులోని కనకదుర్గ ఫెర్టిలైజర్స్ దుకాణంలో పంపిణీ చేసిన యూరియా కోసం మొవ్వ, గూడపాడు, నర్సంపాలెం, మూలపాలెం, కొండవరం, మొవ్వపాలెం, వేములమడ తదితర గ్రామాల నుంచి వందల మంది రైతుల షాపు తెరవక ముందే అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంగణం కిక్కిరిసింది.

యూరియా అందజేత

మండవల్లి: కానుకొల్లు, లింగాల సొసైటీల పరిధిలో ఉన్న 20,350 టన్నుల యూరియాను ఆ సొసైటీల పరిధిలో ఉన్న రైతులకు అందజేసినట్లు శనివారం స్థానిక సబ్‌డివిజన్ ఏడీఏ జి వెంకటమణి, ఏఓ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఏడీఏ మాట్లాడుతూ మండలంలో రైతులు యూరియా సరఫరాపై ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

రామాలయ నిర్మాణానికి రూ.2.20 లక్షల విరాళం

పమిడిముక్కల: తాడంకి గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దాతల సహకారంతో ఆలయ నిర్మాణానికి కమిటీ సభ్యులు అంకురార్పణ చేశారు. గ్రామానికి చెందిన ఆస్ట్రేలియాలో స్థిరపడిన చలపాటి వెంకట గిరిబాబు ఆలయ నిర్మాణానికి రూ.2.20 లక్షలను విరాళంగా పంపారు. ఈ విరాళాన్ని స్నేహితులు, బంధువుల ద్వారా శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఎన్నారై కుటుంబ సభ్యులను సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు మారగాని సుబ్బారావు, పులి గంగాధరరావు, చలపాటి సుబ్బారావు, సువర్ణగంటి నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

సమస్యలను పరిష్కరించాలని సచివాలయ సిబ్బంది ధర్నా

మొవ్వ: తమ సమస్యలను పరిష్కరించాలని మండలంలోని సచివాలయాల సిబ్బంది ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం నల్ల బ్యాడ్జీలతో ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే ప్రతి శుక్రవారం వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ విధులను మూకుమ్మడిగా బహిష్కరించారు.